విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

సోమవారం 11 నవంబర్ 2024 8 పేజీలు

గళం విప్పేనా..?

- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- జిల్లాలో తిష్టవేసిన సమస్యలు, నిధుల కొరత
- ఐక్యంగా ఉంటేనే జిల్లా అభివృద్ధి
- తాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యమే కీలకం
- అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు దూరం

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : జిల్లాలో ప్రజా ప్రతినిధులు ఐక్యంగా గళం వినిపించి నిధులు రాబడితేనే జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుంది. దీనికి ప్రధాన వేదికగా అసెంబ్లీ సమావేశాలు కానున్నాయి. నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఇప్పటికే విజయవాడకు చేరుకున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రెండుసార్లు అసెంబ్లీ సమావేశాలు జరిగాయి. మొదటిసారి కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం కాగా రెండవసారి తాత్కాలిక బడ్జెట్ అకౌంట్‌పై రెండు రోజులు నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుతీరి ఐదు నెలలు అయిన తరువాత పూర్తిస్థాయిలో బడ్జెట్‌ను అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నారు. ఈ సమావేశాల్లో ముందుగా ప్రధాన అంశాలపై చర్చించి కీలకమైన బిల్లులను ఆమోదించనున్నారు. అయితే ఈ సమావేశాలకు వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలు దూరంగా ఉంటామని ఇప్పటికే ఆ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. దీంతో జిల్లాలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో దర్శి నుంచి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం నుంచి చంద్రశేఖర్ వైసీపీ నుంచి విజయం సాధించారు. అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండాలనిఆ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో జిల్లాకు చెందిన వైసీపీ ఎమ్మెల్యేలు సమావేశాలకు గైర్హాజరవుతారు. దీంతో జిల్లాలోని మిగిలిన ఆరు నియోజకవర్గాల తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. ఇప్పటికే టీడీపీకి చెందిన మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామితో పాటు అద్దంకి నియోజకవర్గం ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న గొట్టిపాటి రవికుమార్ కూడా జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో సమన్వయంగా కలిసి మెలిసి ఉంటూ జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషించనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా ప్రకాశం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలందరూ ఒకే మాటపై ఐక్యంగా ఉంటూ అన్ని విషయాల్లో

మిగతా 2 లో ...

ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

జిల్లా కార్యదర్శి ప్రభాకర్

విశాలాంధ్ర-పొదిలి : అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ప్రకాశం జిల్లా 20వ మహాసభను ఈ నెల 19 మంగళవారం పొదిలి పట్టణంలో నిర్వహించబడుతుందని, మహాసభలను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించడం జరిగింది. ప్రభాకర్ మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య 1936 ఆగస్టు 12వ తేదీన లక్నో నగరంలో ఆవిర్భవించి, స్వాతంత్ర సంగ్రామంలో పాల్గొన్నటువంటి ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఆయన ఘనంగా కొనియాడారు. నాటినుండి నేటి వరకు విద్యార్థి సమస్యలపై అనేక సమస్యల ఉద్యమాలకు శ్రీకారం చుడుతూ, అనేక పోరాటాలు నడిపిన విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్నటువంటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని విద్యార్థుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లాలో యూనివర్సిటీ స్థాపన కోసం అనేక ఉద్యమాలు నడిపి యూనివర్సిటీ స్థాపనలో

మిగతా 2 లో ...

పట్టణ అభివృద్ధి కోసమే ఆక్రమణల తొలగింపు

- వివక్షకు తావు లేదు
- అన్నా రాంబాబు వ్యాఖ్యలు సరికాదు
- ఖండించిన ఎమ్మెల్యే కందుల

విశాలాంధ్ర-మార్కాపురం : డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో ఇటీవల జరిగిన ఆక్రమణల తొలగింపు కార్యక్రమంలో ఎలాంటి వివక్షతకు తావు లేకుండా పట్టణ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కార్యక్రమాన్ని చేపట్టామని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. ఆక్రమణల తొలగింపులో అధికారులు వివక్ష చూపించారని మాజీ ఎమ్మెల్యే వైసీపీ నేత అన్నా రాంబాబు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పట్టణంలో 25 వేల జనాభాకు అనుగుణంగా ఉన్న రోడ్లు నేటికి కొనసాగుతున్నాయని అయితే రోజురోజుకు పట్టణం అభివృద్ధి చెందుతుండటంతో పట్టణ జనాభా లక్షకు చేరుకుందని దీంతో ట్రాఫిక్ సమస్య ప్రజలను పట్టి పీడిస్తుందని అన్నారు. ఇలాంటి ప్రత్యేక పరిస్థితుల్లో పట్టణాన్ని సర్వాంగసుందరంగా

మిగతా 2 లో ...

మనం ఎంత చెప్తే అంతే..

షాడో ఎమ్మెల్యేల హల్‌చల్

- ఎమ్మెల్యే తర్వాత తామే అంటూ ప్రచారం
- పట్టణ, ప్రభుత్వ కార్యాలయాల్లో ఓ షాడో ఎమ్మెల్యే గోలగోల
- ఆ ఊరు ఈ ఊరు తేడా లేకుండా మరో బిల్డప్ బాబాయి పెత్తనం
- పని చేయలేకపోతున్నామని ఉద్యోగుల ఆవేదన
- నాలుగు నెలలకే కూటమి ప్రభుత్వంపై అసమ్మతి
- అధినాయకత్వం జోక్యం చేసుకోవాలని టీడీపీ క్యాడర్ సూచన



విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : మేం ఎంత చెపితే అంత, మా నోటి నుంచి వచ్చే మాట ఎమ్మెల్యే నోటి నుంచి వచ్చినట్టే అంటూ ఇద్దరు శీనయ్యలు హవా బాపట్లలో రోజు రోజుకు శృతి మించిపోతుంది. శీనయ్యలు వారి అనుచరుల చేత ఎమ్మెల్యేలం అంటూ ప్రచారం చేసుకోవటం ప్రతి రోజు పరిపాటిగా మారింది. ఇద్దరి షాడో ఎమ్మెల్యేల హవాతో బాపట్ల ప్రజానీకంతో పాటు అధికారులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. ఎవరికి ఏ పని కావాలన్నా మా శీనయ్యను కలవాల్సిందే అని బిల్డప్ ఇవ్వటం అడ్డగోలుగా అక్రమంగా ప్రజలపై అధికారాలుపై పెత్తనం చేయటంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేఖత వ్యక్తం అవుతుంది. నియోజకవర్గంలో అన్నీ వారే అన్నట్లు ఇద్దరు శీనయ్యలు వ్యవహార శైలి ఉందని సొంత పార్టీలోని నేతలే ఆరోపిస్తున్నారు.

- ఎన్నో ఆశలతో రెండు దశాబ్దాల తర్వాత తెలుగుదేశం పార్టీ కార్యకర్తల నిస్వార్ధ కృషితో టీడీపీ జెండా బాపట్లలో రెపరెపలాడింది. ఇందులో పార్టీ కార్యకర్త సైనికుల పనిచేశారు అనటంలో ఎటువంటి సందేహం లేదు. ఊహించిన దానికంటే విజయం వరించింది అనుకుంటున్న తెలుగు తమ్ముళ్లు జనసైనికులు బాపట్ల నియోజకవర్గంలో జరుగుతున్న పరిస్థితులపై ఆందోళన చెందుతున్నారు. అధికారంలోకి రాకముందు ఊహించినదొకటి అధికారం వచ్చిన తరువాత జరుగుతున్న పరిస్థితితో కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. ఈ తంతు ఎప్పటికీ మారుతుందా అని ఏ రోజు కారోజు లెక్కలు వేసుకుంటూ కార్యకర్తలు కాలం గడుపుతున్నారు.



- బాపట్ల పట్టణంలో ప్రధానంగా ఒక షాడో ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిత్యం అధికారులపై ఆ పని చేయి ఈ పని చేయి

మిగతా 2 లో ...

గళం విప్పేనా..?

(మొదటిపేజీ తరువాయి)

ముందుకెళ్తున్నారు. ముఖ్యంగా జిల్లా అభివృద్ధిలో కీలకమైన ప్రధాన అంశాల పరిష్కారంలో ముఖ్యమంత్రిని కలవడం ఆ సమస్యల పరిష్కారానికి కలిసిమెలిసి పోరాటం జరుగుతుంది. ఈ నేపథ్యంలో నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలో ప్రధానంగా నెలకొన్న పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యేందుకు 1182 కోట్ల రూపాయలు అవసరమని జిల్లా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మరోపక్క కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్ల పునర్నిర్మాణం కోసం ఇతర కాలువలు, తదితర పనులు పూర్తి చేసేందుకు 450 కోట్లు అవసరమని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ రెండింటికి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే జిల్లాలో త్రాగు, సాగునీరు సమస్య పరిష్కారం అవుతుంది. తద్వారా జిల్లాలో వ్యవసాయ రంగం పురోభివృద్ధి చెందుతుంది. త్రాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది. ఈ రెండు ప్రాజెక్టులకు అవసరమైన నిధుల విషయంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లాకు పిలిపించి ప్రాజెక్టును పరిశీలింపచేశారు. మంత్రి కూడా వెలుగొండ ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలనే ఆలోచనకు వచ్చారు. అంతేకాకుండా ఈ రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు తరువాత రెండవ ప్రాధాన్యత ప్రాజెక్టుగా వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయనున్నట్లు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది. ఈ బడ్జెట్ సమావేశాల్లో వెలుగొండ ప్రాజెక్టు పూర్తికి అవసరమైన నిధులను కేటాయించే అవకాశం లేకపోలేదు. మరోపక్క జిల్లాలో యూనివర్సిటీ లేకపోవడం, మార్కాపురంలో మెడికల్ కాలేజీ అసంపూర్తిగా ఉండటం, మార్కాపురం కేంద్రంగా జిల్లా అభివృద్ధి చేయడం ప్రధాన అంశంగా ఉన్నాయి. 2014లో రాష్ట్ర విభజన నేపథ్యంలో కేంద్రం ప్రకటించిన కనిగిరి ప్రాంతంలో నిమ్జ్, ఇండస్ట్రియల్ కారిడార్ ఈ ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. నడికుడి-శ్రీకాళహస్తి పనులు మందకోడిగా నడుస్తున్నాయి. వీటికి కూడా ఈ బడ్జెట్ సమావేశాల్లో తగిన నిధులు కేటాయింపు జరిగితే జిల్లా అభివృద్ధి వేగం పుంజుకుంటుంది. ఇప్పటికే జిల్లా ఏర్పడి ఐదు దశాబ్దాలు గడిచినప్పటికీ తాగు, సాగునీటికి విద్య, వైద్యానికి జిల్లా ప్రజలు దూరంగానే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు ఐక్యంగా ఉండి జిల్లా అభివృద్ధిలో అవసరమైన నిధులు రాబట్టడంలో నేటి నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

పట్టణ అభివృద్ధి కోసమే ఆక్రమణల తొలగింపు

(మొదటిపేజీ తరువాయి)

తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఆక్రమణలను తొలగించడం జరిగిందని అన్నారు. వైసీపీ నేతలు చెప్పినట్లుగా ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేవని అన్నారు. ఎండోమెంట్ భూములను అన్యాక్రాంతం చేసిన వారిపైన తగు చర్యలు తీసుకోవాలని రాంబాబు కోరడాన్ని స్వాగతిస్తున్నానని, వైసీపీకి చెందిన గొలమారి శ్రీనివాసరెడ్డి సర్వేనెంబర్ 206బిలో స్థలాన్ని ఆక్రమించారని అన్నారు. రాంబాబు చెప్పిన విధంగా వైసీపీ పార్టీ నాయకుడైనా సరే సస్పెండ్ చేస్తానని చెప్పడం జరిగిందని, ఇప్పుడు ఆయనను ముందుగా పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానం భూములను అన్యాక్రాంతం చేసింది వైసీపీ నాయకులేనన్న విషయాన్ని రాంబాబు గుర్తుంచుకోవాలని అన్నారు. మా పార్టీవారు ఎవరైనా అన్యాక్రాంతం చేస్తే నేను ఏదోరకంగా వారికి నచ్చచెప్పి ఎండోమెంట్‌శాఖకు అప్పచెప్తానని అన్నారు. పశ్చిమ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులకు నిధులు కేటాయించకుండా కాలక్షేపం చేసిన వైసీపీ పార్టీకి ప్రాజెక్టుపై మాట్లాడే హక్కు లేదని అన్నారు. 1996లో వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది నాటి ముఖ్యమంత్రి చంద్రబాబేనని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా జరిగాయంటే అది ఒక్క టీడీపీ హయాంలోనేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుమతి లేకుండా మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు చేపట్టారని వైసీపీ ప్రభుత్వాన్ని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంతో మెడికల్ కాలేజీని కొనసాగించాలని ఆలోచన చేస్తుందని ఎమ్మెల్యే కందుల అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, మునిసిపల్ కౌన్సిలర్ నాలి కొండయ్య, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కనిగిరి బాల వెంకటరమణ, పార్టీ నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ గ్రామ సింహాలు

- ప్రయాణీకుల్లో భయాందోళనలు
- మరోపక్క ఆవులతో వాహనదారుల ఇక్కట్లు
- చర్యలు చేపడతాం : కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్

విశాలాంధ్ర - చీరాల : చీరాల పట్టణంలో గ్రామ సింహాలు హడలెత్తిస్తున్నాయి. ప్రధాన రహదారుల్లో వచ్చే పోయే ప్రయాణీకులు, వాహన దారుల వెంటపడుతుంటే గ్రామ సింహాల భయంతో పట్టణ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పట్టణంలోని ముప్పై మూడు వార్డులలో చీరాల రూరల్ 15పంచాయతీలలో గ్రామ సింహాలు హడలెత్తిస్తున్నాయని అర్ధరాత్రి గుంపులుగా చేరిన గ్రామ సింహాలు వాహనాల వెంటపడి ప్రమాదాలకు కారణంగా నిలుస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో గ్రామ సింహాలు బెడద తీవ్రంగా ఉండడంతో మహిళలు, చిన్నారులు రోడ్డున నడవాలంటే భయపడుతున్నారు.

ప్రధాన రహదారుల్లో అదమరిస్తే అంతే

ప్రధాన రహదారిల్లో గ్రామ సింహాలు గుంపులుగా చేరి వచ్చి పోయే వారిపై దాడులు చేసేందుకు గ్రామసింహాలు సిద్ధంగా ఉంటున్నాయని పాఠశాలకు వెళ్ళి వచ్చే చిన్నారులపై గ్రామ సింహాలు దాడి చేస్తే ఎవరికి చెప్పుకోవాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

- పంచాయతీల్లో ఇళ్లలోకి : పంచాయతీలలో గుంపులుగా సంచరిస్తున్న గ్రామ సింహాలు ఇళ్లల్లో మనుషులు లేకపోతే ఇళ్లలోకి వెళ్లి వంట సామాగ్రి, దుస్తులు,ఆహార పదార్థాలు చిందర వందర చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామ సింహాలతో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ రోడ్డుపై వెళ్లాలంటే జంకుతున్నారు.గతంలో పట్టణంలోని శాంతినగర్ లో అంగన్వాడీ ఆయాను కుక్కలు వెంటపడి కరిచాయని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.ఇదే సందర్భం చిన్న పిల్లలు అయితే పరిస్థితి ఏమిటని అధికారులు సత్వరమే పట్టణ మండల పరిధిలోని గ్రామ సింహాలను పట్టి దూరంగా తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

- పట్టణంలో, మండలంలో కుక్కల స్వైర విహారం...

కుక్కలు పట్టణంలో స్వైర విహారం చేస్తున్నాయి.పట్టణంలో ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ చిన్న పిల్లలు, మహిళలు,వృద్ధులు,సైకిల్, ద్విచక్ర వాహనదారులను వెంబడించి పరుగు పెట్టిస్తున్నాయి. రోడ్లపై గుంపులు గుంపులుగా వచ్చి రోడ్డు పై నుంచి వెళ్లే ప్రజలను వెంబడించి భయపెడుతున్నాయి. రాత్రి సమయంలో ప్రధాన రహదారుల్లో వెళ్ళాలంటే వాహనదారులు భయపడిపోతున్నారు.

- ఆవులతో ఇక్కట్లు..

చీరాల పట్టణంలో ఆవులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఆవుల పెంపకందారులు బజారుపై అవులను వదలివేయడంతో రోడ్డుపై దొరికే ఆహారం తింటూ రోడ్లకు అడ్డంగా ఆవులు రోడ్లపై పడుకుని ట్రాఫిక్ కి ఇబ్బందులు కలిగిస్తున్నాయి.నిత్యం రద్దీగా ఉండే పట్టణంలోని గడియార స్తంభం మార్కెట్ సెంటర్లో సాయంత్రానికి ఆవులు చేరి ట్రాఫిక్ కి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఇప్పటికే కొందరు యువకులు ఆవుల యజమానులకు అవగాహన కల్పించి యజమానులు వద్దకు ఆవులను తరలించాలని లేదంటే పట్టణంలో తిరుగుతున్న ఆవులను గోశాలకు తరలించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని చీరాల మునిసిపల్ కమిషనర్ కి వినతి పత్రాలు సైతం ఇచ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే పట్టణంలోని గ్రామ సింహాల బెడద ఆవుల బెడద తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరిస్తాం

- కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్

గ్రామ సింహాలకు సర్జరీ చేసేందుకు హైదరాబాద్ లోని పశువుల ఆసుపత్రిలో మాట్లాడామని,ఒక్కో కుక్కకు 1560రుసుము చెల్లించి సర్జరీ చేయించి ఎక్కడ నుంచి తీసుకెళ్ళమో అక్కడే వదలివేయాలని ఒక వారం రోజులలో చర్యలు తీసుకుంటామన్నారు.ఆవులను మనిషిని పెట్టి తొలిస్తున్నామని ఆవుల యజమానులతో మాట్లాడి సమస్యను తొలగిస్తామని చీరాల మునిసిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ తెలిపారు.

విజయవంతం చేయండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రముఖ పాత్ర పోషించిన సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేయాలని, ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని అనేక సమస్యలకు పొదిలి మహాసభ వేదిక కాబోతుందని, ఈ మహాసభలలో అనేక సమస్యలపై చర్చలు జరుగుతాయని, అంతేకాకుండా నూతన నాయకత్వాన్ని ఎన్ను కోవడం కూడా జరుగుతుందని ఆయన అన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రామాంజి మాట్లాడుతూ ఈనెల 19న జరుగు మహాసభలకు ముఖ్య అతిథులుగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, మాజీ జాతీయ కార్యదర్శి ఈశ్వరయ్య,మాజీ ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు నారాయణ, కరుణానిధి,తదితరులు మహాసభలలో ముఖ్య అతిథులుగా పాల్గొనబోతున్నారని, మహాసభలకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రం విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు జి.స్టాలిన్, కే.సురేంద్ర, టీ.సన్నీ, కే.జోషి, జి.అశోక్ పాల్గొన్నారు.

మనం ఎంత చెప్తే అంతే..

(మొదటిపేజీ తరువాయి)

అంటూ గోల గోల చేస్తున్నాడు. ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే ప్రతి పనిలో ప్రతి సెటిల్మెంట్‌లో తానే ఉండాలని తన మాటే చెల్లాలని అధికారులను హెచ్చరిస్తూ హుకుం జారీ చేస్తున్నాడు. గతంలో ఎన్నడు లేని విధంగా ఓ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తి మాపై ఈ విధంగా పెత్తనం చెలాయిస్తున్నాడని అధికారులు బాపట్లలో మేము ఇక పని చేయలేం మరో నియోజకవర్గం చూసుకుంటా అని వారి సహచరులు దగ్గర చెప్పుకుంటున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

- మరో వైపు మరో షాడో ఎమ్మెల్యే ఆ వూరు ఈ వూరు అని తేడా లేకుండా గ్రామాల్లో అడ్డగోలుగా అక్రమంగా ఇసుకను తవ్వి అమ్ముకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలను దిక్కరిస్తున్న పరిస్థితి ఏర్పడిందని పార్టీ క్యాడర్ విమర్శలు గుప్పిస్తున్నారు. పార్టీ గెలుపు కోసం పార్టీని అధికారంలోకి రావాలని నిత్యం ప్రచారంలో పాల్గొని ఎమ్మెల్యేగా పోటీ చేసిన నరేంద్ర వర్మ గెలిపించాలని కంకణం కట్టుకొని తిరిగిన నాయకులు ఎవరు కూడా కనిపించడం లేదని పార్టీ నేతల్లో చర్చకు దారి తీసింది. పట్టణంలో ఒక షాడో గోల ఆ వూరు ఈ వూరు అనే తేడా లేకుండా అక్రమ వ్యాపారాల్లో పార్టీకి తీవ్ర నష్టం చేకూర్చే విధంగా వ్యవహార శైలి ఉందనే చర్చ జరుగుతుంది. వచ్చిందే అవకాశం మనం చెప్పిందే వేదం మన మాటే శాసనం అనే విధంగా అడ్డగోలుగా ప్రవర్తిస్తూ అక్రమాలకు తెరలేపుతున్న పరిస్థితి ఏర్పడింది.

- బాపట్ల జిల్లా ఇంచార్జి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొలుసు పార్థసారథి బాపట్ల నియోజకవర్గంలో జరుగుతున్న పరిస్థితులపై ఆరా తీయాల్సిన పరిస్థితి ఎంతైనా ఉంది. పట్టణంలో ఓషాడో ఎమ్మెల్యే గోల ఆ వూరు ఈ వూరు అనే తేడా లేకుండా మరో షాడో ఎమ్మెల్యే ప్రభుత్వ నిబంధనలను పాతరేస్తూ చేస్తున్న అక్రమ వ్యాపారాలపై హెచ్చరించి పార్టీ ప్రతిష్టను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని టిడిపిలో పలువురు సీనియర్ నాయకులు అభిప్రాయ పడుతున్నారు. మేము చెబితే ఎమ్మెల్యే చెప్పినట్టే మేము వచ్చి అడిగితే ఆయన పంపించినట్టే మీరు పని చేయండి అనే విధంగా ఇరువురి షాడో ఎమ్మెల్యేల ధోరణి ఉండటం పార్టీ నేతల కలవరపాటుకు గురిచేస్తుంది. ఇప్పటికైనా జిల్లా ఇంచార్జి మంత్రి కొలుసు పార్థసారథి తో పాటు టిడిపి అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాపట్ల పరిస్థితులపై ఒకసారి అధ్యయనం చేసి క్షేత్రస్థాయిలో కార్యకర్తల్లో ఉన్న అసహనాన్ని నివృత్తి చేయాల్సిన అవకాశం ఎంతైనా ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

బలిజ సేవా సంఘం మినీ కల్యాణ మండపం ప్రారంభం

విచ్చేసిన గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని ముండ్లపాడు రోడ్డులో బలిజ సేవా సంఘం నూతనంగా నిర్మించిన మినీ కల్యాణ మండప ప్రారంభోత్సవ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి కాపు సంఘము నాయకులు మేళతాళాలతో పూలమాల శాలువాలు వేసి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాపు సంఘము అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా నేడు ఈ కల్యాణ మండప ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టటం చాలా సంతోషకరమైన విషయమని, కాపు సోదరుల అభివృద్ధికి తాను ఎల్లప్పుడు ముందుంటానని, ఎటువంటి సహకారం ఉన్న తనకు తెలియచేయవచ్చునన్నారు. నాడు తెలుగుదేశం హయాంలో తాను శాసనసభ్యులుగా ఉన్న సమయంలో గిద్దలూరు, కొమరోలు, రాచర్ల, కంభం మండల కేంద్రాల్లో కాపు భవనాలకు నిధులు మంజూరు చేయటం జరిగిందని గుర్తు చేశారు. నేడు అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం కాపుల అభివృద్ధికి కట్టుబడి ఉందని, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు గారికి చేదోడుగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాలనలో అన్నీ వర్గాలకు న్యాయం చేసే దిశగా పాలన సాగిస్తున్నారని నియోజకవర్గంలో ఏ సమస్య ఉన్న పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానన్నారు. గిద్దలూరు బలిజ సేవా సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రహిత నగరంగా కనిగిరిని తీర్చిదిద్దుదాం

కనిగిరి సీఐ ఖాజావలి

విశాలాంధ్ర-కనిగిరి : ట్రాఫిక్ రహిత నగరంగా కనిగిరిని తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కనిగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ షేక్ ఖాజావలి అన్నారు. ఆదివారం కనిగిరి పట్టణంలోని శ్రీనివాస థియేటర్లో ఎస్సై శ్రీరామ్ ఆధ్వర్యంలో వ్యాపార యజమానులకు వాహనదారులకు ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సీఐ ఖాజావలి మాట్లాడుతూ వ్యాపారస్తులు దుకాణ దారులు షాపులు వెలుపల సీసీ కెమెరాలు నో పార్కింగ్ బోర్డులను పెట్టుకోవాలని వారికి సూచించారు. రద్దీగా ఉండే ప్రాంతాలలో రెండు వారాలు ఒకవైపు మరో రెండు వారాలు ఇంకో వైపు వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు. నిర్లక్ష్యంగా రోడ్లపై పశువులను వదిలే యజమానులపై చర్యలు చేపడతామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోతే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

గొట్టిపాటి లక్ష్మికి దివ్యాంగుల వినతి

విశాలాంధ్ర-కురిచేడు : దర్శి రోడ్డులో గల తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపం శంకుస్థాపనకు వచ్చిన ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి అలాగే దర్శి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మికి దివ్యాంగుల విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ సందు వెంకటరావు ఆధ్వర్యంలో దర్శి నియోజకవర్గంలోని దివ్యాంగుల అందరూ కలిసి గతంలో జరిగిన క్యాంపుకు సంబంధించిన వీల్ చైర్ బ్యాటరీ బండ్లు కృత్రిమ అవయవాలు ఇవ్వలేదని అవి ఇవ్వవలసిందిగా ఆదివారం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. గొట్టిపాటి లక్ష్మికి దివ్యాంగుల కమిటీ హాల్ కోసం స్థలము కేటాయించమని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ దివ్యాంగుల అధ్యక్షులు పూసల ఓబయ్య, కురిచేడుమండల అధ్యక్షులు మామిదాల వెంకయ్య ముండ్లమూరు అధ్యక్షులు బాబూరావు సామేలు ధర్నపూడి దివ్యాంగులు పాల్గొనడం జరిగింది.

పిడతల రంగారెడ్డి జయంతి

విశాలాంధ్ర-గిద్దలూరు : మాజీ శాసన సభా స్పీకర్, మాజీ శాసనమండలి చైర్మన్, మాజీ ఆర్థిక శాఖ మాత్యులు, గిద్దలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన అభివృద్ధి ప్రదాత, శ్రీ వివేకానంద విద్యాసంస్థలను స్థాపించిన విద్యాదాత పిడతల రంగారెడ్డి 107వ జయంతిని వారి స్మారక మందిరం వద్ద పూలమాలలతో ఘనంగా నిర్వహించారు. వారి కోడలు గిద్దలూరు మాజీ శాసన సభ్యురాలు పిడతల సాయి కల్పనారెడ్డి వారి సమాధి వద్ద పూలమాలతో నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులు అభి మానులు రాజకీయ ప్రముఖులు కార్యకర్తలు పుర ప్రముఖులు శ్రేయోభిలాషులు శ్రీ వివేకానంద విద్యాసంస్థల ప్రిన్సిపల్స్ ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

అసభ్యకరంగా పోస్టులు పెడితే చర్యలు తప్పవు

ఎస్ఐ ఆర్ సుమన్

విశాలాంధ్ర-సీఎస్‌పురం : సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మహిళలపై చిన్నపిల్లలపై అసభ్యకరంగా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఎస్‌పురం ఎస్ఐ ఆర్ సుమన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-సంతనూతలపాడు : మండలంలోని మైనంపాడు గ్రామం నందు బత్తుల వెంకట్రావు ఇంటి నుండి బండారు సుబ్బారావు ఇంటి వరకు 5 లక్షల విలువగల సీసీ రోడ్డుకు ఆదివారం గ్రామ సర్పంచ్ దాట్ల రమణ గ్రామ యువ నాయకులు ఆళ్ల అవినాష్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసిచేశారు. వారు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాభివృద్ధికి బాటలు వేస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొడుగు కాలేషా పెరుగు రాము షేక్ నాయబ్ రసూల్ దాసరి కృష్ణారావు అసిస్టెంట్ ఇంజనీర్ యోగేష్ రాయపాటి అనిల్ ఉప్పులూరు శ్రీను ఇర్లా వెంకటేష్ ఆకుల కోటేశ్వరరావు ఆళ్ల బ్రహ్మయ్య ఆళ్ల రవీంద్ర ఎద్దూరి నాగరాజు. షేక్ మస్తాన్ వలి ఖాజావలి రాయపాటి ప్రేమ కుమార్ వాలేటి రామాంజి ఆళ్ల రామకృష్ణ మాదాల సుబ్బారావు అట్లూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదును వినియోగించుకోండి

కనిగిరి ఆర్డీఓ జి.కేశవర్ధన్ రెడ్డి

విశాలాంధ్ర-పీసీపల్లి : ప్రత్యేక ఓటరు నమోదును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కనిగిరి ఆర్డీఓ జి కేశవర్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. ఈ నెల 9, 10 తేదీల్లో 23,24 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు నమోదు (ఫారం-6) ఓటు తొలగింపు (ఫారం-7) వివరాల మార్పు నకు (ఫారం-8) దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్వోలు రెండు రోజులపాటు అందుబాటులో ఉండాలని ఎటువంటి పొరపాట్లు లేకుండా దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవర్ధన్ రెడ్డితో పాటు తహసిల్దార్ సిహెచ్ ఉష మండల రెవెన్యూ అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలి

విశాలాంధ్ర-మర్రిపూడి : భూగర్భ జలాలను పెంచేందుకు ఇంకుడు గుంటలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతలను మంజూరు చేస్తుందని ఏపీవో జీ రాంబాబు అన్నారు. ఆదివారం మండలంలో ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం వెయ్యి మంది లబ్ధిదారులను గుర్తించి వాళ్ళ ఇళ్ళ ముందు ఇంకుడు గుంతలు తీస్తున్నామని అన్నారు. ఒక్కొక్క లబ్ధిదారునకు 6000 రూపాయలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఇళ్లల్లోని వాడుక నీరును గుంతల ద్వారా వచ్చేట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

అర్హులందరికి ఓటు నమోదు

విశాలాంధ్ర-మర్రిపూడి : ఎన్నికల అధికారుల ఉత్తర్వుల మేరకు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తాసిల్దార్ జ్వాలా నరసింహారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులందరూ ఓటు హక్కు కలిగించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటర్ చేర్పులకు ఫారం సిక్స్ తొలగించడానికి ఫారం సెవెన్‌తో పాటు ఆధార్ ధ్రువీకరణ పత్రం లేదా పదో తరగతి మార్కుల లిస్టు లేదా వయస్సు నిర్ధారణ ధ్రువీకరణ పత్రం పూర్తిచేసి బీఎల్ఓకు గాని లేదా ఆన్లైన్లో గాని దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మర్రిపూడి వీఆర్వో బడే సాహెబ్ గ్రామ సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే ముత్తుముల



విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో మండల ప్రధాన కార్యదర్శి బిజ్జాల తిరుమలరెడ్డి కుమారుడు విరాట్ రెడ్డి మరియు నాగకవితలకు జరిగిన వివాహ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : నగరపాలక సంస్థ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు జీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని జీఎంసీ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంను స్థానిక వాకర్స్, జీఎంసీ అధికారులతో కలిసి కమిషనర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియంను క్రీడల హబ్‌గా, ఉదయం సాయంత్రం వాకింగ్ చేసుకునే వారికి ఆహ్లాదంగా, సమగ్ర మౌళిక వసతుల కేంద్రంగా తీర్చిదిద్దడానికి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టేబుల్ టెన్నిస్, షటిల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్ట్‌లను, పురుషుల, మహిళల జిమ్‌లను పరిశీలించి, ప్రతి రోజు ఆయా క్రీడలకు ఎంత మంది వస్తున్నారు, స్టేడియం సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేడియంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కొన్ని చోట్ల స్లాబ్ పెచ్చులు ఊడిందని, గోడలు బీటలు వచ్చాయని, వాటిని వెంటనే మరమత్తు చేయాలన్నారు. జిమ్‌లో ఆధునాతన ఎక్విప్మెంట్ ఏర్పాటుకు, బ్యాడ్మింటన్ గ్రౌండ్‌లో లైట్లు, ఇతర అవసరమైన ఏర్పాట్లు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వర రావు, డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ రమేష్, ఏఈ చైతన్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి బాబు తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్యా ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

విశాలాంధ్ర-మంగళగిరి : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం ఈ నెల 9న శనివారం నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశపరీక్ష ఫలితాలు ఆదివారం విడుదల అయ్యాయి. ఈ మేరకు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, పరీక్షల కో-ఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్‌లు ఫలితాలను విడుదల చేశారు. ఈ ప్రవేశపరీక్షకు 201 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 188 మంది విద్యార్థులు హాజరయ్యారు. అందులో 184 మంది విద్యార్థులు అర్హత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలు నవంబర్ 15తో ముగుస్తాయని తెలిపారు. ప్రవేశపరీక్షల్లో అర్హులైన వారి జాబితాను దూరవిద్య కేంద్రం వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. అలాగే ఏపీ ఐసెట్ 2024లో అర్హత సాధించిన విద్యార్థులు కూడా ఈ ప్రవేశాలకు నేరుగా అర్హులని తెలియజేసారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల సమన్వయకర్తలకు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి, సూపరింటెండెంట్ నేలపాటి నాగేశ్వరరావు, ప్రోగ్రామర్ మోహన్, అకాడమిక్ కౌన్సిలర్లకు డైరెక్టర్ వెంకటేశ్వర్లు, కోఆర్డినేటర్ రామచంద్రన్‌లు అభినందించారు.

వజ్రబాబుకు అభినందనలు తెలిపిన వైఎస్సార్‌సీపీ నాయకులు



విశాలాంధ్ర- తుళ్లూరు : తాడికొండ నియోజక వర్గ సమన్వయకర్తగా నియమితులైన వనమా బాలవజ్ర బాబు(డైమండ్ బాబు)ను మండల వైసీపీ నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మండల పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషగిరిరావు, గంజిమాల కోటేశ్వరరావు, ఆరేపల్లి జోజి, కొప్పుల అంద్రెప్ప, తంబి, సరిగల శ్రీను బాలవజ్ర బాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. వైసీపీకి పూర్వవైభవం తీసుకొచ్చే కృషిలో తామంతా భాగస్వాములవుతామని చెప్పారు.

విజ్ఞాన్ స్కూల్ పూర్వ ఉపాధ్యాయుల అపూర్వ కలయిక

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఆనాటి జ్ఞాపకాలు నుంచి నేటి కుటుంబ పరిస్థితుల వరకు పలకరింపులు... పులకరింతలతో చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ పూర్వ ఉపాధ్యాయుల సందడికి వేదిక య్యింది. విజ్ఞాన్ హైస్కూల్‌లో పనిచేసిన పూర్వ ఉపాధ్యాయులందరూ తమ కుటుంబ సభ్యులతో ఆదివారం విజ్ఞాన్స్ యూనివర్సిటీలో కలిసారు. నాలుగు దశాబ్దాల అనంతరం కలిసిన వారంతా సందడిగా, సరదాగా, హుషారుగా గడిపారు. ఎవరెక్కడ స్థిరపడ్డారో తెలియజేయడంతో పాటు మిత్రులందరి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. స్వీయ చిత్రాలు, బృంద చిత్రాలు దిగారు. గడిచిన రోజులను గుర్తుచేసుకుని ప్రతిఒక్కరూ కొత్త అనుభూతికి లోనయ్యారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విజ్ఞాన్ విద్యాసంస్థలు ఉన్నత స్థాయికి ఎదిగి అభివృద్ధి పథంలో నడవడానికి కృషి చేసిన మీరందరూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చి నేడు ఇక్కడ పూర్వ ఉపాధ్యాయుల సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేసారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఎదుగుదలకు మీరందరూ ఫౌండర్స్‌గాను, వెన్నెముకగాను నిలిచారన్నారు. వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులు, చదువు నేర్పిన గురువులను ఎప్పటికీ గౌరవిస్తూనే ఉండాలని తెలిపారు. మీరందరు ఇచ్చిన సహకారంతో ప్రస్తుతం విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రముఖ విద్యాసంస్థలతో పోటీపడే స్థాయిలో నిలబడిందన్నారు. అనతికాలంలోనే ప్రతిష్టాత్మకమైన నాక్ ఏం గ్రేడ్, ఎన్ఐఆర్ఎఫ్‌లో 72వ ర్యాంక్, రెండు తెలుగు రాష్ట్రాలలో ఇప్పటి వరకు ఎవరూ సాధించని ఎబెట్ అక్రిడిటేషన్ సాధించిడం వంటి అక్రిడిటేషన్లు సాధించిందని పేర్కొన్నారు. పురపాలక టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రామక్రిష్ణ, సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ కమిషనర్ వీరభద్రరావు, చేబ్రోలు ఎంఈవో వెంకటేశ్వరరావు, విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఇంటర్నేషనల్ స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ ఏ.శారద, కేవిస్ రామారావు, నారాయణ, ప్రసాదరావు, పాపకుమారి, నిర్మల, భాగ్యలక్ష్మి, సరళాదేవి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రారంభించాలి

విశాలాంధ్ర-మంగళగిరి : రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిపోయిన కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వ కళేజీల కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షులు బీఎస్ఆర్ శర్మ, ప్రధాన కార్యదర్శి బీజే గాంధీ కోరారు. ఆదివారం మంగళగిరి శివాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం కాంట్రాక్టర్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని జీఓ నెంబర్ 114ను తీసుకురావడం జరిగిందని అన్నారు. ఈ జీఓ ఉత్తర్వులు విడుదల చేసిన వెంటనే చట్ట ప్రకారం ఒక్క విద్యా శాఖలో తప్ప అన్ని శాఖలలో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించారని వారు తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వ అధికారులను అనేకసార్లు కలిసి విన్నవించిన క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రారంభించలేదని అన్నారు. విధి లేని పరిస్థితిలో వినూత్న రీతిలో దశల వారి కార్యక్రమానికి అసోసియేషన్ పిలుపునిచ్చిందని తెలిపారు. ఆ పిలుపులో భాగంగా మంగళగిరి శివాలయంలో హోమం ద్వారా దేవుడిని వేడుకున్నాని తెలి పారు. ఇప్పటికే పిఠాపురంలో చేశారన్నారు. కుప్పం నియోజకవర్గంలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి నారా లోకేష్‌ను కలిసి విన్నవించామనీ వారు తెలిపారు. అయినప్పటికీ ఇంతవరకు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు వేల మంది లెక్చరర్లు కాంట్రాక్టు బేసిక్‌లో పనిచేస్తున్నారని అన్నారు. చాలీచాలనీ వేతనాలతో జీవితం కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి జీఓ నెంబర్ 114ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిగ్రీ కళాశాల ప్రధాన కార్యదర్శి డి.రాజు, గుంటూరు జిల్లా అధ్యక్షులు వై.రమేష్ బాబు, కార్యదర్శి ఎం.బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కు స్వాగతం పలికిన హరి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: అటవీ శాఖ కార్యాలయంలో అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఆదివారం జరిగిన సంస్మరణ కార్యక్రమానికి గుంటూరు విచ్చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఘనస్వాగతం పలికారు. చుట్టుగుంట వీఐపీ రోడ్డు మార్గంలో వచ్చిన పవన్ కళ్యాణ్ ప్రజలకు అభివాదం చేశారు. రెల్లి యువ నాయకులు సోమి ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో రెల్లి కార్పొరేషన్‌ను కొనసాగించాలంటూ రెల్లి యువత, మహిళలు ప్లాకార్డులు ప్రదర్శించారు. జనసేన నగర నాయకులు మెహబూబ్ బాషా, కోలా అంజి, కదిరి సంజీవ్, చిన్నంశెట్టి శ్రీకాంత్, మాధవి, ఆసియా తదితరులున్నారు.

ఎన్నో విశిష్టమైన తీర్పులు ఇచ్చిన జస్టిస్ డీవై చంద్రచూడ్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : న్యాయవాదిగా.. న్యాయమూర్తిగా.. సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిగా ఏ పదవిని నిర్వహించినా రాజీ పడకుండా రాజ్యాంగాన్ని పరిరక్షించడమే తన ప్రధాన కర్తవ్యంగా పని చేసిన జస్టిస్ డివై చంద్రచూడ్ అభినందనీయుడని, ఆయనిచ్చిన తీర్పులు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కొనియాడారు. ఈ మేరకు అవగాహన సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యక్తులను దృష్టిలో పెట్టుకొని కాకుండా రాజ్యాంగాన్ని ప్రామాణికంగా తీసుకొని తాను తీర్పునిచ్చినట్లు తెలిపారు. ఎన్నో విశిష్టమైన.. కీలకమైన తీర్పులు ఇచ్చారని, వాటిలో కాశ్మీర్‌కి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని 370 అధికరణం ముఖ్యమైనదని, ఎన్నికల బాండ్ల పథకంపై తీర్పు ఇస్తూ దీని చెల్లుబాటు రాజ్యాంగ విరుద్ధమని చాలా నిర్మొహమాటంగా స్పష్టం చేస్తూ ఇచ్చిన తీర్పులు దేశ ప్రజలకు సంతోషాన్ని ఇచ్చాయన్నారు. ఎన్నికల బాండ్ల జారీని బ్యాంకులు వెంటనే నిలిపేయాలంటూ ఆయన ఇచ్చిన తీర్పులు ప్రధాన రాజకీయ పార్టీలకు ఇబ్బంది కలిగించినా లెక్క చేయలేదని చెప్పారు.

220 మందికి కంటి పరీక్షలు

విశాలాంధ్ర-కాకుమాను : మండల పరిధిలోని కొండపాటూరు గ్రామంలోని ప్రైమరీ హై స్కూల్ నందు యార్లగడ్డ జయప్రదం రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ యార్లగడ్డ అంకం చౌదరి ప్రారంభించారు. డాక్టర్లు రమణ, చైతన్య 220 మందిని పరీక్షించి 102 మందిని శుక్లముల ఆపరేషన్లకు ఎంపిక చేశారు. హాస్పటల్ మేనేజర్ శ్రీనివాస్, గ్రామ పెద్దలు గన్నవనేని రాఘవ రావు, చుండూరు శ్రీనివాస్, కాటూరి శ్రీనివాస్, అంకినీడు, మండవ లక్ష్మీనారాయణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మధుమేహ బాధితుల పాదాల సమస్యల నిర్లక్ష్యం ప్రమాదకరం

ప్రముఖ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ రామలింగేశ్వరరావు



విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మధుమేహం కలవారు కాళ్లు పాదాల చిన్న సమస్యలను కూడా తేలికగా తీసుకొని నిర్లక్ష్యం చేయరాదని, ఆ చిన్న సమస్యలే ప్రమాదకరంగా మారి చివరకు కాలు లేదా వేళ్ళు తొలగించే పరిస్థితులు వస్తాయని ప్రముఖ శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ కె.రామలింగేశ్వరరావు తెలిపారు. మధుమేహ నిరోధక మాసం సందర్భంగా స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ఓ సమావేశ మందిరంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న 'మధుమేహంపై శాస్త్రీయ అవగాహన సభ', 'ఉచిత వైద్య శిబిరాలలో భాగంగా 'మధుమేహం-పాదాల పరిరక్షణ'అనే అంశంపై శాస్త్రీయ అవగాహన సభ, ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.రామలింగేశ్వరరావు మాట్లాడుతూ దీర్ఘకాల మధుమేహ బాధితులలో రక్తనాళాలు సన్నబడిపోవడం..రక్త సరఫరా సరిగ్గా జరగకపోవడం..న్యూరోపతి వల్ల స్పర్శ నొప్పి తీవ్రత తెలియకపోవడం..రోగ నిరోధక శక్తి తగ్గిపోవడం వంటి కారణాల వల్ల చిన్నదెబ్బ తగిలినా గాయాలు పెద్దవి అవుతాయని పేర్కొన్నారు. నొప్పి తెలియని కారణంగా మధుమేహ బాధితులు వాటినీ నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆ గాయాలు ఇన్ఫెక్షన్‌కు గురై అవి బాగా పెరిగిపోయి చీముపట్టి ప్రమాదకరంగా మారతాయని అన్నారు. ఆ గాయాలలో ఇన్ఫెక్షన్ పెరిగిపోయి ఆ భాగం కుళ్ళిపోవడమే కాక సూక్ష్మజీవులు రక్తంలో చేరి సెప్టిసీమియాకు దారితీసి ప్రాణాంతకం అవుతుందన్నారు. ఎల్లప్పుడూ కాళ్లు, వేళ్ళ మధ్య తేమ లేకుండా చూసుకోవాలని, చెప్పుల విషయం లోనూ..గోళ్ళు కత్తిరించే విషయాలలో అప్రమత్తంగా ఉండాలని, కాలిన గాయాలైనా వెంటనే వైద్యుని సంప్రదించాలని సూచించారు. మధుమేహ బాధితుల రక్తంలో షుగర్ శాతం పూర్తిగా నియంత్రణలో ఉంచుకుంటూ, కాళ్లు పాదాలను జాగ్రత్తగా పరీక్షించు కోవాలన్నారు. ఎస్‌హెచ్ఓ అధ్యక్షులు డాక్టర్ సేవకుమార్ మాట్లాడుతూ మన తెలుగు రెండు రాష్ట్రాల్లో మధుమేహం చాపకింద నీరులా వేగంగా వ్యాప్తి చెందుతుందని, ప్రతి ఒక్క కుటుంబంలో ఒకరైన మధుమేహ బాధితులు ఉండటం ఒకింత బాధించే విషయమేనన్నారు. ప్రజారోగ్య, ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపే మధుమేహం నిరోధకంలో ప్రతి ఒక్క పౌరుడు, ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సభకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ,మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి ధనుంజయ రెడ్డి అధ్యక్షత వహించారు. సభానంతరం పాదాల సమస్యలు గల వారిని డాక్టర్ రామ లింగేశ్వరరావు పరీక్షించి వైద్య సలహాలు అందజేశారు.

మురుగునీరుతో అవస్థలు

◈ముందుకు సాగని మురుగునీరు

◈అవస్థలు పడుతున్న గ్రామ ప్రజలు

◈పారిశుద్ధ్య చర్యలుచేపట్టని అధికారులు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ముండ్లమూరులో కాలువలలో మురుగునీరు ముందుకు కదలక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు ఈ బజారు వైపు చూడలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు శుభ్రం చేయకపోవడంతోనే మురుగు ముందుకు వెళ్లడం లేదు. ఎస్టీ ఇళ్ల వద్ద కాలువలలో మురుగు పేరుకుపోయి ఎటు పోయే మార్గం లేక సిమెంట్ రోడ్డు పైనే మురుగు నిలిచి ఉండడంతో రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు కొన్ని బజార్ల లో కాలువలు తీయించారు. మరికొన్ని బజారులో కాలువలు శుభ్రం చేయకుండానే వెళ్లిపోయారని గ్రామస్తులు అంటున్నారు. ఇళ్ల నుండి వచ్చేవాడుక నీరుతో పాటు ఈ మధ్య కురిసిన వర్షాలకు కాలువలు నిండిపోయాయి. కొన్నిచోట్ల మురుగు నీరు నిల్వ ఉండి ఆ నీటిపై తెట్ట కట్టింది. దీంతో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళనచెందుతున్నారు. ప్రస్తుతం కాలువలో మురుగు మయంగా మారిందని, కొంతమంది టైఫాయిడ్ జ్వరాలతో అల్లాడుతున్నామని గ్రామస్తులు అంటున్నారు. బ్రహ్మంగారి చెట్టు వీధిలో పారిశుద్ధ పనులు చేపట్టాలని అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూడికతీత పనులు చేపట్టి మురుగు నిలవ లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామాల్లో ఓటరు జాబితా లభ్యం

విశాలాంధ్ర - పర్చూరు : ఓటర్ జాబితాను గ్రామాల్లోని సచివాలయాలలో అందుబాటులో ఉంచామని తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. ఆదివారం రమణాయపాలెం,ఉప్పుటూరు, చెరుకూరు, నూతలపాడు గ్రామాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఆయా గ్రామాల ఓటర్ల జాబితాను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే 12వ తేదీ మంగళవారం లోపు తెలియజేయాలన్నారు. 13వ తేదీ బుధవారం చివరి ఓటర్ జాబితా సచివాలయంలో అందుబాటులో ఉంటాయని తహసీల్దార్ తెలిపారు. ఆర్ఐ ప్రేమ్ కుమార్, బిఎల్వోలు,సూపర్వైజర్లు ఉన్నారు.

బావూడ ఛైర్మన్ 'సలగల'కి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బావూడ ఛైర్మన్‌గా టీడీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు నూతనంగా నియమితులైన సందర్భంగా బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ అయనను మర్యాద పూర్వకంగా కలసి పూల బొకే అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.సుదీర్ఘ రాజకీయ అనుభవం ఎన్నికల సమయంలో జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి జిల్లాను టీడీపీకి క్లీన్ స్వీట్ చేయడంలో తన కృషి ఎంతో ఉందన్నారు.టిడిపి జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్ బాబుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ పదవి కేటాయించడంపై ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పఠాన్ రాజేష్,కర్నాటి ఏడుకొండలు,భీమా లీలా కృష్ణ,గవిని దుర్గ ప్రసాద్,నక్క ప్రకాష్,పామిడి భాస్కరరావు,తోట నాగేశ్వరరావు, కె.హరినాథ్ రెడ్డి,బొగిరి రామారావు తదితరులు ఆయనకి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

చినఅరవపల్లిలో సంఘం డైరీ పాల సేకరణ కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - రేపల్లె : మండలంలోని చినఅరవపల్లి గ్రామంలో సంగం డైయిరి పాల సేకరణ కేంద్రాన్ని టీడీపీ సీనియర్ నాయకులు అనగాని శివప్రసాద్ ప్రారంభించారు. సంఘం డైరీ సేవలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సంగం డైయిరి డైరెక్టర్ ఎన్.వి.కె ప్రసాద్ (బుజ్జి), జడ్పీటీసీ సర్రా సుబ్బయ్య,టీడీపీ నాయకులు తాత ఏడుకొండలు,దేవగిరి రవిశంకర్,మురళీధర్‌రావు, జి.మురహరరావు,పట్టణ జనసేన అధ్యక్షులు ఆర్ మహేష్,జనసేన పార్టీల నాయకులు దేవగిరి శంకర్ సాయి,గ్రామ సర్పంచ్ లోయ బాబు, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్యవైశ్య సంఘం కార్తీక వన సమారాధన

విశాలాంధ్ర - రేపల్లె : పవిత్ర కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆదివారం ఓల్డ్ టౌన్ అంకమ్మ చెట్టు వద్దనున్న జమిందార్ కోట ప్రాంగణంలో రేపల్లె పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం కనుల విందుగా జరిగింది. రేపల్లె పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాలేపల్లి ఈశ్వర బాబు అధ్యక్షతన స్వామివారి వ్రత కార్యక్రమంలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా వేలాదిమంది ఆర్యవైశ్య కుటుంబాలు ఈ వన సమారాధన కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆర్యవైశ్య మహిళలకు వివిధ ఆటల పోటీలు,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.వన సమారాధన కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఆర్యవైశ్య మహిళకు పసుపు,కుంకుమ,రవిక,అరటిపండు,స్వీటు ప్యాకెట్లను అందజేశారు.ఈ వన సమారాధన కార్యక్రమానికి విచ్చేసిన ఆర్యవైశ్యులకు పట్టణ అధ్యక్షుడు ఈశ్వర బాబు వారి సొంత ఖర్చులతో వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్యులు పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు ఈశ్వర బాబును దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు.ఈ కార్యక్రమంలో రేపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్ తూనుగుంట్ల విశ్వనాథ గుప్తా,ఆర్యవైశ్య సంఘ గౌరవ అధ్యక్షుడు మటుపల్లి సుబ్బారావు,పట్టణ బిజెపి అధ్యక్షుడు అన్నం సాయి వరప్రసాద్, రేపల్లె పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు స్వామి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలను పరిరక్షించుకోవాలి

విశాలాంధ్ర - రేపల్లె : జనవరి 5వ తేదీ విజయవాడలో జరిగే రాష్ట్రవ్యాప్త హైందవ శంఖారావం బహిరంగ సభకు సన్నాహక సమావేశం ఆదివారం రేపల్లె శివాలయం ఆలయ ప్రాంగణంలో జరిగింది.ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యకారిణి సభ్యులు రాజేంద్ర ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ హిందువుల ఐక్యతతో దేవాలయాల్ని పరిరక్షించుకోవాలని దేవాలయాలపై రాజకీయ పెద్దల, పెత్తనం ఉండకూడదన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవాహా పరికూటి శివగోపి,ఆదిశేషు, గూడవల్లి కుటుంబరావు,రాంబాబు, జంజనం హేమశంకరరావు,పేరం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేటేరులో టీడీపీ సభ్యత్వం నమోదు

విశాలాంధ్ర - రేపల్లె : తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో పలు ప్రయోజనాలు పొందవచ్చునని మాజీ ఉపసర్పంచ్ ఆరేపల్లి వీరబాబు కార్యకర్తలకు సూచించారు. రేపల్లె మండలం పేటేరు గ్రామంలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ రూ.100 సభ్యత్వంతో రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించేలా టీడీపీ సభ్యత్వ కార్యక్రమాన్ని రూపొందించింది అన్నారు. అంతేకాదు. 1లక్ష రూపాయలతో శాశ్వత సభ్యత్వం పొందేలా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది.పార్టీ కార్యకర్తలకు లబ్ది చేకూరేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆరేపల్లి నాగరాజు,గోలి రామశేషగిరిరావు, శాస్త్రి, పూర్ణ, పడవలశంకర్,డోకు శ్రీను, లూథర్, రాంబాబు, కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొప్పెరపాడు విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - బల్లికురవ : ఈ నెల 9,10వ తేదీల్లో రాష్ట్ర జన విజ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో కొప్పెరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించి వారి ప్రతిభ చాటుకున్నారు.ఈ చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో మొత్తం 22 జిల్లాల విద్యార్థులు పాల్గొన్నారు.బాపట్ల జిల్లా తరపున పాల్గొని క్విజ్ (విజువల్),టాలెంట్ టెస్ట్,ప్రయోగాలు,క్విజ్ నాలుగు విభాగాల్లో జరిగిన సైన్స్ పోటీల్లో కొప్పెరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కే.సాయి చరణ్ తేజ,బి. కోటేశ్వరరావు,షేక్ మస్తాన్ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం విజేతలుగా నిలిచారు.కొప్పెరపాడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు,సైన్స్ డిపార్ట్‌మెంట్ ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, బాలాజీ,జానకి రాందాస్,విజయరోస్,గ్రామపెద్దలు,తల్లిదండ్రుల కమిటీ అభినందనలు తెలిపారు.

వివాహ వేడుకల్లో 'దద్దాల'

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని నాగిరెడ్డిపల్లి లో చాగలమర్రి జీవరత్నం ఏమెలమ్మ ల కుమారుడు చాగలమర్రి మేరీకుమార్ , అశ్వినిల వివాహ వేడుకలో కనిగిరి వైసీపీ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు ఈ క్రమంలో వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చాగలమర్రి మోషే, సర్పంచ్ స్వర్ణ ఏడుకొండలు, ఆదినారాయణ రెడ్డి, నియోజకవర్గం ఎస్సీ సెల్ నాయకులు కటికల వెంకటరత్నం, ఎస్సీ సెల్ అధ్యక్షులు గోన జేమ్స్,పాణ్యం మురళీ, సైకం రమణారెడ్డి, అహరోను, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత నమోదు

విశాలాంధ్ర-వెలిగండ్ల : ప్రతి గ్రామంలోని టీడిపి కార్యకర్తలు సానుభూతిపరులు తమ సభ్యత్వాన్ని నమోదు చేయించుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొడ్డ వెంకటసుబ్బారెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని నాగులవరం జాల్లపాలెం గుడిపాటిపల్లి తదితర గ్రామాల్లో సభ్యత నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో తెలుగుదేశం సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికి పార్టీ అండదండగా నిలుస్తుందని సభ్యత్వం గ్రామ నాయకులు, పార్టీ కార్యకర్తలు ప్రతి ఒక్కరికి చేరే విధంగా కృషి చేయాలని తెలిపారు. గతంలో రెండు లక్షల ఉన్న ప్రమాద బీమాను ఐదు లక్షలకు పెంచడం జరిగిందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యకర్తలను అండగా ఉండేందుకు ఇటువంటి భరోసా ఏర్పాటు చేస్తున్నారని, ఈ క్రమంలో ముఖ్యమంత్రిగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కీసర రమణారెడ్డి, వెన్న రమణారెడ్డి, వెంకట చెన్నయ్య, తుమ్మ సుబ్బారెడ్డి, కళ్ళు వెంకటేశ్వర్లు, బాసూ సుబ్బారెడ్డి ముక్కు మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లంపి స్కిన్ వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి

విశాలాంధ్ర-కొండపి : లంపి స్కిన్ వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం రవికుమార్ తెలిపారు. స్థానిక పశుసంవర్ధక శాఖ ఏడిఏ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. లంపి స్కిన్ వ్యాధి లేదా ముద్ద చర్మవ్యాధి ఈరోజుల్లో ప్రబలంగా పశువుల్లో కనిపిస్తుందని తెలిపారు. కావున రైతు సోదరులు తగిన జాగ్రత్తలు తీసుకొని తమ పశు సంపదను కాపాడుకోవాలని సూచించారు. ముద్ద చర్మవ్యాధి సోకిన పశువులను మిగతా పశువులలో కలవకుండా వేరుగా ఉంచాలని తెలిపారు. ముద్ద చర్మవ్యాధి పశువుల వద్దకు వెళ్లిన రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆవు గేద జాతి పశువుల్లో కనిపించే ఈ ముద్ద చర్మ వ్యాధి నుండి రైతులు తమ పశుసంపదను కాపాడుకోవాలని అన్నారు. లంపి స్కిన్ వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని తెలిపారు. లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాలు మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాల్లో పశు వైద్యశాలల్లో అందుబాటులో ఉన్నాయని రైతులు సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు.

ఆటోల్లో అధిక ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు

-ఎస్ఐ మధుసూదన్‌రావు
-విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర-వెలిగండ్ల : ప్రభుత్వ నిర్ణయించిన ఛార్జీల కంటే అధికంగా వసూలు చేస్తే ఆటో యజమానులపై చర్యలు తీసుకుంటామని ఎస్సై మధుసూదన్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని ఆటో యజమాన్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన ఛార్జీలనే ప్రజల వద్దను వసూలు చేయాలని అంతకంటే అధికంగా వసూలు చేస్తే తగు చర్యలు ఉంటాయని అందులో భాగంగా శనివారం విశాలాంధ్ర వచ్చిన కథనాన్ని స్పందించి ఆయన ఈ విధంగా స్పందించారు కంకణంపాడు, అగ్రహారం నుండి వెలిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులకు ఆర్టీసీ బస్సులు సమయానికి రానందున అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న ఆటో యజమానులపై చర్యలు తీసుకోవాలని శీర్షిక ప్రచురితమైంది ఇందులో భాగంగానే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆటో యజమానులకు సూచనలు ఇచ్చారు ఈ క్రమంలో ఆ గ్రామ ప్రజలు, విద్యార్థిని విద్యార్థుల తల్లి దండ్రులు ఎస్ఐకి కృతజ్ఞతలు తెలిపారు. ఆటో యజమానులు కానిస్టేబుల్ పాల్గొన్నారు.

నిత్యాన్నదాన భవనానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : నెహ్రూ బజార్‌లోని శ్రీ శిరిడి సాయిబాబా మందిరంలో ఆదివారం నిత్యాన్నదాన భవన శంకుస్థాపన నిర్వహించారు. బాబా మందిరం నందు గత 14 సంవత్సరాల నుండి బీదలు సాధువులు వికలాంగులకు వృద్ధులకు ప్రతిరోజు నిత్యాన్నదానం జరుగుతుంది. అన్నదానం కార్యక్రమం శాశ్వత ప్రాతిపదికన జరుపుటకు దత్త మందిరం పక్కన సుమారు 280 చదరపు గజముల స్థలంలో శంకుస్థాపన జరిగింది. పూజా కార్యక్రమంలో మందిర కార్యదర్శి గోపాలుని హరిహరరావు అధ్యక్షులు పేరం సత్యనారాయణ సతి సమేతంగా జరిపారు. మందిర పూజారులైన రామకృష్ణాచార్యులు రవి శర్మలు పూజలు హోమాలు నిర్వహించారు. ఆ తదుపరి భూరి విరాళం సమర్పించిన దాతలకు పెద్దలకు సన్మాన కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం సుమారు 1500 మంది అన్నదానం నిర్వహించారు. శంకుస్థాపన కార్యక్రమంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలుగుదేశం నాయకులు కందుల రామిరెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ మాజీ చైర్మన్ వక్కలగడ్డ మల్లికార్జునరావు జనసేన నాయకులు మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ బీజేపీ నాయకులు మార్కాపురం నియోజకవర్గ ఇన్ఛార్జి పీవీ కృష్ణారావు ప్రకాశం జిల్లా వర్కింగ్ జర్నలిస్ట్ అధ్యక్షులు నూకని వెంకటరమణ అగ్గి రామకృష్ణ తదితర కార్యక్రమంలో పాల్గొన్నారు. మందిర కోశాధికారి పివిఎల్ఎన్ వి నాగరాజు ఉపాధ్యక్షులు రాముడు గు వెంకట నాగ గోపి అదనపు కార్యదర్శి చల్లా పవన్ కుమార్ సకల నరసింహులు యూత్ అధ్యక్ష కార్యదర్శి గోపాలుని కృష్ణమోహన్ కరీం భాష యూత్ కమిటీ సభ్యులు మరియు మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు. మందిర మేనేజర్ సతీష్ నాయుడు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రోడ్లకు మరమ్మతులు

విశాలాంధ్ర-తాళ్లూరు : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తుందని దర్శి టీడీపీ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి అన్నారు. తూర్పుగంగవరం-జమ్మల మడక రోడ్‌లో బీటీ రోడ్ పనులను తూర్పు గంగవరం వద్ద ఆమె ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గోతులమయంగా ఉన్న రోడ్డును పరిశీలించి మరమ్మతులకు తాను హామీ ఇచ్చానని చెప్పారు. అందుకు అనుగుణంగా నేడు పనులు పురోగతిలో ఉండడాన్ని ఆమె గుర్తు చేసారు. గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్డులు అన్ని గుంతల మయం అయి ప్రజలు వాహనదారులు ఎంతో ఇబ్బందులు పడిన విషయాలను గుర్తు చేసారు. కార్యక్రమంలో టిడిపి నియోజక వర్గ నాయకుడు కడియాల లలిత సాగర్, మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రెడ్డి ఒబులురెడ్డి, నాయకులు షేక్ పేద కాలేషా వలి (బడే), ఇడమకంటి శ్రీనివాస రెడ్డి, వెంకట రావు, రామయ్య, గొల్లపూడి వేణుబాబు,కళ్యాణ్, ఎన్. ఆదినారాయణ రెడ్డి, రామకోటిరెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తకు అండగా టీడీపీ

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : తెలుగుదేశం పార్టీలో సభ్యత్వ నమోదు చేస్తున్న ప్రతి ఒక్క కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మహమ్మదాపురం పంచాయతీ లలో సభ్యత్వం కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అలానే ఎన్నడు లేని విధంగా టీడీపీ 43 సంవత్సరాలుగా కార్యకర్తలకు అండగా ఉంటూ కార్యకర్తల సంక్షేమం కోసం సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలుపెట్టి కార్యకర్తలకు ఎటువంటి ఆపద వచ్చిన ప్రమాదం జరిగిన కార్యకర్త కుటుంబాన్ని ఆదుకోవడం లక్ష్యంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలుపెట్టడం జరిగిందన్నారు.ప్రస్తుతం 100 రూపాయలతో సభ్యత్వం చేసుకుంటే రెండు లక్షలు ఉన్న ప్రమాద బీమా రూ.5 లక్షల వరకు పెంచిందన్నారు.అలానే సహజ మారణానికి రూ.10వేల బీమా సౌకర్యం కూడా వస్తుందని కార్యకర్తలు అందరూ కూడా సభ్యత్వ నమోదు ఈవిధిగా చేసుకోవాలని ప్రతి ఒక్కరికి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కొండపరెడ్డి నాగిరెడ్డి, గంగ్ర వెంకటేశ్వర్లు, సుమిత్ర తిరుపతిరెడ్డి,చీకటి వెంకట సుబ్బయ్య,అబ్బర్వర్, కోటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-టంగుటూరు: శాఖా గ్రంథాలయం టంగుటూరు ఆధ్వర్యంలో ఆదివారం చదవడం నాకు ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొని తమకిష్టమైన పుస్తకాలను చదవడం జరిగినది. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయం నిర్వాహకులు గుమ్మడి వర్ధన్ రాజ్ మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని కావున ఆరవ తరగతి నుండి పదవ తరగతి మరియు ఇంటర్ డిగ్రీ విద్యార్థిని విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామన్నారు. పాల్గొని విద్యార్థిని విద్యా ర్థుల కు బహుమతులు కూడా అందజేస్తామని ఈ కార్య క్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు.

గంగా భవానికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-తాళ్లూరు : జిల్లాలో ప్రసిద్ధి చెందిన గంటి గంగా భవాని అమ్మవారి ఆలయాన్ని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మెట్టెల బాలరాజు, పి విజయలక్ష్మి, ప్రకాశ రావు, కామేశ్వర రావుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ పి కార్తిక్, ఆలయ కమిటి చైర్మన్ కోసనా గురు బ్రహ్మం, ఆర్.ఎ కాటూరి ప్రసాద్ లు ఆలయంలో భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

తీగలేరుతోనే సాగు, తాగునీరుకు పరిష్కారం..

విశాలాంధ్ర-పుల్లలచెరువు : పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు తీగలేరు సాధన కొరకు భారత కమ్యూనిస్టు పార్టీ అనుబంధ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం బృందం ఆదివారం మండలంలోని కాలువ పరివాహక ప్రాంత గ్రామాలైన కాశి కుంట తండా నుంచి కొమరోలు, ఎంగ్రపల్లి, మల్లాపాలెం మరియు తండాలు, రాచకొండ, వెంకరెడ్డిపల్లి, ఆర్ ఉమ్మడివరం పుల్లలచెరువు వివిధ గ్రామాలలో ప్రాజెక్టు ఆవశ్యకత గురించి రైతులతో ముచ్చటించారు. అనంతరం విలేకరుల సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకులు టిసి హెచ్ చెన్నయ్య మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు అంతర్గత భాగమైన 5 బ్లాక్ ను కాల్వను ఎర్రగొండపాలెం మండలం లోని వీరయ్యపాలెం వరకు కాలువ పూర్తి అయినదని పుల్లలచెరువు చిన్న కండ్లేరు చెరువు వరకు చేయవలసిన ఆగిపోయినవని గత ప్రభుత్వంలో కాలువ సర్వే చేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు, అనంతరం ప్రభుత్వం టీవీ5 గురించి ఎటువంటి చర్యలు చేపట్టలేదు, సర్వే నివేదిక ప్రకారం సుమారు 80 కోట్లు అవుతాయని నివేదిక పంపారు, ఈ ప్రాజెక్టు కాలువ పూర్తి అయితే దాదాపు 11,500 ఎకరాలు సాగులోకి వస్తుందని త్రాగు నీరు కూడా 50వేల నుండి 60 వేల జనాభాకు తాగునీరు అందుబాటులోకి వస్తుంని, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాన్ని ఇచ్చే ఈ కాలువ పనులు కోసం రాబోవు బడ్జెట్ సమావేశంలో నిధులు కేటాయించి సత్వరమే పూర్తి చేయాలని సీపీఐ అనుబంధ రైతు సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఎర్రగొండపాలెం నియోజకవర్గ సీపీఐ సహాయ కార్యదర్శి గురునాథం మాట్లాడుతూ గతంలో కూడా సాగర్ ప్రాజెక్టు జలాలు పుల్లల చెరువు మండలానికి దాపులో ఉన్నప్పటికీ కూడా నోచుకోలేదని, ఇప్పుడున్న పరిస్థితుల్లో కూడా పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు టీవీ5 కాలువ పోరాటం ద్వారా సాధించు కునే పరిస్థితి నెలకొన్నదనే అన్నారు. వర్షాభావం మీద ఆధారపడి పంటలు పండించుకునే పరిస్థితి ఉన్నదని భూగర్భ జలాలు పడిపోవటం వల్ల బోర్ల మీద ఆధారపడి పంటలు

పండించుకునే పరిస్థితి నేటికి జరుగుతుందన్నారు. వేసవిలో మంచి నీరు కూడా దొరకక నేటికీ ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి, మంచినీటి కోసం ట్యాంకర్ల ద్వారా ప్రభుత్వం కోట్ల రూపాయల ఖర్చు పెడుతుంది, అదేవిధంగా ప్రభుత్వం మంచినీటి దాహార్తి తీర్చేందుకు, ముటుకులలో సమ్మర్ స్టోరేజ్ కి కోట్లు రూపాయలు ఖర్చు పెట్టిందని నేటికీ కూడా సమ్మర్ స్టోరేజ్ ద్వారా 44 గ్రామాలకు మంచినీటి సౌకర్యం కల్పించే దానిలో విఫలమైందని, పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ద్వారా తీగలేరు కాలువ పనులు చేపట్టినట్లయితే మండలం కరువు కాటకాల నుండి పూర్తిగా విముక్తి చెందుతుందన్నారు. పెరుగొండ పాలెం నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు బాణాల రామయ్య మాట్లాడుతూ రైతుల నష్ట బారిన పడకుండా రైతులను ఆదుకోవాలని ప్రతి రైతుకు 20 వేల రూపాయలు పెట్టుబడి సాయం అందివ్వాలని. రాష్ట్ర ప్రభుత్వం పంటల భీమా సొమ్ము ప్రభుత్వం మే ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులు వెంటనే పూర్తి ప్రాజెక్టు పరిధిలో పునరావస గ్రామాల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

గిద్దలూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిగా రంగస్వామి

విశాలాంధ్ర-రాచర్ల : నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పగడాల రంగస్వామి మూడోసారి పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అధికారికంగా నియమించారు. రంగస్వామి 1989 నుండి 2024 వరకు కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నాడు గతంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసినారు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సెక్రెటరీగా జనరల్ సెక్రెటరీగా మూడుసార్లు పీసీసీ కమిటీలో పనిచేసిన నామీద నమ్మకంతో గిద్దలూరు ఇన్చార్జిగా నియమించినందుకు మల్లికార్జున కార్గిరాహుల్ గాంధీకి పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి కెవిపి రామచంద్ర రావు ఎన్ రఘువీరారెడ్డి రుద్రరాజు ఏం ఏం పలరాజు గౌతమ్ ఎన్ వి జితేంద్ర బాబు డిసిసి మరియు అందరి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఐదో రోజుకు చేరిన పరిసరాల పరిశుభ్రత

విశాలాంధ్ర-సీఎస్‌పురం : కదిరిబాబురావు వ్యవసాయ కళాశాలలో నాలుగవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ సేవాపథకం కార్యక్రమం కింద అయిదవరోజు ఆదివారం కళాశాల ఆవరణలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలలో తెగుళ్ళు నివారణ రహదారి వెంబడి దోమల నివారణకు స్ప్రేయింగ్ ఇతర కార్యక్రమాలు చేపట్టారు.ఈకార్యక్రమంలో జాతీయ సేవాపథకం ప్రోగ్రాం ఇంచార్జి, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీవిద్య, విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో చైతన్యం

విశాలాంధ్ర-దుర్గి: విద్య ద్వారానే సమాజంలో చైతన్యం వస్తుందని కార్ప్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ టి.అమర్నాథ్ అన్నారు. కార్ప్ సంస్థ బాలబాట ఆర్గనైజర్ల సమావేశం దుర్గి మండలం ముటుకూరు గ్రామంలో ఆదివారం జరిగింది. సమావేశానికి అమర్నాథ్ ముఖ్యఅతిథిగా వచ్చి మాట్లా డారు. ఈ సమావేశానికి బాలబాట ఏసిఓ కుక్కమూడి ప్రమీల అధ్యక్షత వహించారు. బాలబాట ఆర్‌సిఓ పి ప్రసాద్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో పిల్లలను పోటీ పరీక్షలకు సిద్ధం చేయాలని ఆయన కోరారు. దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ విద్య లేకపోతే నేడు అన్ని రంగాలలో రాణించలేమని,కార్ప్ సంస్థ జిల్లాలో వెనుకబడిన ప్రాంతం దుర్గి మండలంలో విద్య పట్ల చూపుతున్న విధానం చాలా బాగుందని కార్ప్ సంస్థ సేవలు ప్రశంసనీయమని ఆయన అన్నారు. అనంతరం బాలబాట డి.ఓలకు ఒకనెల ప్రొవిజన్ అందించారు. కార్యక్రమంలో విద్య చైతన్య గేయాలు ఆలపించారు. ఈకార్యక్రమంలో ముటుకూరు ఏ ఈఎల్‌సి పాస్టర్ రెవరెండ్ కటికల యేసుదానం తదితరులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్ల ఒప్పందాలు అమలు చేయాలి

విశాలాంధ్ర-వెలిగండ్ల : స్కీం వర్కర్లు అంగనవాడి, ఆశ, ఈవోపీ జీవ ఒప్పందాలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు మండల కార్యదర్శి రాయల మాలకొండ అన్నారు. ఆదివారం మండలంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో సమావేశం మల్లెల రాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగనవాడిలా 42 రోజుల సమ్మె విరమణలో ఇచ్చిన ఒప్పందాలను అమలు చేయాలని, ఈఆర్‌ఎకు జీతాలను 15 వేలకు పెంచుతామని ప్రతిపక్ష హోదాలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని తెలంగాణలో అమలవుతున్న విధంగానే పేస్కేల్ జీతాలు చెల్లించి ప్రమోషన్ తో పాటు సమస్యలు పరిష్కరించాలని, స్కూల్ శానిటేషన్ వర్కర్స్ కు కాస్మెటిక్ వస్తువులతో పాటు పదివేల జీతం పెంచాలని కుక్కింగ్ కార్మికుల జీతాలకు 8000 కు పెంచుతామన్న మాట నిలబెట్టుకోవాలని, వారికి యూనిఫాం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికులకు ఇసుక విధానం అమలులో కిరాక చాలా ఇబ్బందులు పడుతున్నారని, నెలలో10 లేక15 రోజులు కన్నా పని దొరకటం లేదని వారన్నారు. గ్రామాల్లో స్కీం వర్కర్ల మీద రాజకీయ వేధింపులు ఇంకాకొనసాగుతున్నాయని రాజకీయ నాయకులు,ప్రభుత్వం ఉన్నవారితో పనులు చేపించుకోవాలి కానీ తొలగింపులు జరుగుతున్నాయని తక్షణమే అలాంటి తొలగింపులు ఆపాలని వారన్నారు. ఈ సమావేశంలో వివిధ కార్మిక సంఘం నాయకులు కే నాగేశ్వరి, కే లక్ష్మి ,ఆర్ రమాదేవి ఎస్ మరియమ్మ జె రమేష్ ,పి చక్రిరావు, ఎం రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

11 మంది బియల్వోలపై చర్యచేపట్టాలి

విశాలాంధ్ర-తాళ్లూరు : ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా విధులకు దుమ్మాకొట్టిన11 మంది బియల్వోల్లపై చర్యచేపట్టాలని దర్శినియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎం.వి.ఎస్.లోకేశ్వరరావు ఆదివారం జిల్లా కలెక్టర్ కు నివేదిక పంపారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు శని, ఆదివారం ల లో బూత్ లెవెల్ అధికారులు పోలింగ్ కేంద్రాలవద్ద అందుబాటులో వుండి ముసాదా ఓటర్ లిస్ట్ ను పబ్లిష్ చేయటం, స్పెషల్ క్యాంపెయిన్ రోజుల్లో ఓటర్ల ధరఖాస్తులను స్వీకరించాల్సి వుంది. మండలంలోని 11 మంది బియల్వోలు విధులకు హాజరు కాలేదు. ఎన్నికల విధులకు హాజరుకాని బియల్వోల్లపై తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ దర్శిఎలక్ట్రోల్‌జిస్ట్రేషన్ అధికారికి రిపోర్ట్ చేశారు. వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఈఆర్వో జిల్లా కలెక్టర్ కు నివేధిక పంపారు.

చిన్నారులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్

విశాలాంధ్ర-సంతనూతలపాడు : సంతనూతలపాడు ఎస్సి కాలనీలో నీ బొద్దులూరి రామారావు రాజ్యలక్ష్మి దంపతుల కుమార్తెలు జ్యోతిర్మయ ఉదయలక్ష్మి ల ఓణీల ఫంక్షన్ వేడుకలు ఆదివారం జరిగాయి ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయ్ కుమార్ హాజరై చిన్నారులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు మాజీ జెడ్పిటిసి తన్నీరు శ్రీనివాసరావు బాపట్ల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి రాంపటోటి అంకారావు తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు తెలుగుమహిళా అధ్యక్షురాలు నార్నే మాధవి లత చెరుకూరు శ్రీనివాసరావు బొద్దు శంకర్ మందార సతీష్ శ్రీనివాసరావు ఎలమంద సంధ్యాల రామయ్య ఎం రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

తులసీ సీడ్స్ సౌజన్యంతో కర్రసాము పోటీలు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : తులసి సీడ్స్ సౌజన్యంతో ఏన్షియంట్ ఇండియన్ శిలంబమ్ ఫెడరే షన్ ఆధ్వర్యంలో గుంటూరు టీజేపీఎస్ టీజేపీఎస్ కళాశాలలో సౌత్ ఇండియా స్థాయిలో శిలంబం పోటీలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ పోటీలను టీజేపీఎస్ కళాశాల కరస్పాం డెంట్ బ్రహ్మం ప్రారంభించారు. పోటీలకు పూర్తిగా అవసరమైన క్రీడాసామగ్రి, మెడల్స్, మెమెంటోస్, టీషర్ట్స్, 300 మంది క్రీడాకారులకు భోజనం వసతి, అల్పాహార వస తులను తులసి సీడ్స్ వారు ఏర్పాటు చేశారు.

దీనికి గాను రూ. 2.50 లక్షలు తులసి సీడ్స్ వారు సమకూ ర్చడం జరిగింది. ఈ పోటీలు ఆద్యంతం ఆసక్తికరంగా, రసవత్త రంగా జరిగాయి. పోటీలలో గెలుపొం దిన కర్రసాము వీరులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ముఖ్యఅతిథి తులసి రామచంద్ర ప్రభు అందజేశారు.

ఆయన మాట్లాడుతూ గత రెండు నెలలుగా శ్రమిస్తూ 'ప్రథ మ సౌత్ ఇండియా సిలంబమ్ 2024' పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని కార్యక్రమ నిర్వహణ విజయవంతంగా పూర్తి చేసిన కర్రసాము కోచ్ వర్మ, కర్రసాము గ్రాండ్ మాస్టర్ జిడుగు సుబ్బారావును ప్రత్యేకంగా అభినందించారు. ఈ ప్రాచీన కళ కర్రసాము(సిలంబం) కనుమరుగు అవ్వకూడదనే ఉద్దేశ్యం తోనే ఈ కార్యక్రమ ఏర్పాటుకు పూర్తి సహాయ సహకారాలు అందించామ న్నారు. భవిష్యత్‌లో కూడా సహకరిస్తా మని వెల్లడించారు. ఈ టోర్నమెం ట్‌లో ఆంధ్ర, తెలంగాణ, కేరళ, తమిళనాడు రాష్ట్రా నుంచి 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో ఉగ్గిరాల సీతారామయ్య, దళవాయి సుబ్రహ్మణ్యం, సిద్ధార్థ వర్మ, సుదీర్, సుమంత్, వర్మ, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆంజనేయరాజుకు సత్కారం

విశాలాంధ్ర - అద్దంకి : జానపద పురాణ పాత్రల్లో అద్భుతంగా నటించి రంగస్థల రంగానికి ఎనలేని ఖ్యాతి తెచ్చిన అద్దంకి కి చెందిన మిద్దె బోయిన ఆంజనేయరాజుకు పుట్టం రాజు బుల్లయ్య రామలక్ష్మమ్మల కళా పురస్కార సభ ఆదివారం స్థానిక మారం వారి సేవాసదన్‌లో ఘనంగా జరిగింది.సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ ఆంజనేయరాజు కళారంగానికి చేసిన సేవలను సభకు పరిచయం చేశారు.పురస్కార ప్రదాత పుట్టం రాజు శ్రీరామ చంద్రమూర్తి మాట్లాడుతూ కళే దైవంగా జీవనోపాధిగా బ్రతుకు వెళ్ళదీసిన వృత్తి కళాకారులను గుర్తించి రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు కళాకారులకు పింఛన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం పురస్కార గ్రహీత మిద్దె బోయిన ఆంజనేయరాజుకు పుట్టం రాజు బుల్లయ్య రామ లక్ష్మమ్మల కళా పురస్కార ద్రవ్యం రూ.5000లు,పట్టు బట్టలు జ్ఞాపికలను పుట్టం రాజు శ్రీరామచంద్రమూర్తి శైలజ దంపతులు అందించారు.

అంబేద్కర్ చిల్డ్రన్స్ పార్క్‌లో చిన్నారుల సందడి

విశాలాంధ్ర - రేపల్లె : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిల్డ్రన్స్ పార్క్ అంటే పట్టణంలో చిన్నపిల్లల వద్ద నుండి పెద్దల వరకు సెలవు దొరికితే చాలు పిల్లలు పెద్దలు కుటుంబాలతో పార్క్‌లో దర్శనమిస్తూ ఉంటారు. రూ.20 లక్షల వ్యయంతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిల్డ్రన్ పార్క్‌లో చిన్నారులు ఆడుకునేందుకు జారుడుబల్లలు, ఉయ్యాలలు, చాపల ఎక్వేరియం, రంగులరాట్నం తదితర పరికరాలు,ఆట వస్తువులను ఈ పార్కులో చిన్నారులకు అందుబాటులో ఉంచారు.కరోనా సమయంలో చిన్నారులతో సహా పెద్దవారు కూడా ఇల్లు వదిలి బయటకు రాలేదు,దిక్కుతోచని పరిస్థితుల్లో ఇళ్లల్లోనే మగ్గిపోయారు.ఎప్పుడైతే ఆంక్షలు సడలింపు చేశారో రెక్కలు విప్పిన పక్షులా చిన్నారులు పార్కుల వైపు పరుగులు తీస్తున్నారు. ఇది గమనించిన రేపల్లె పురపాలక సంఘం పాలకవర్గం ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిల్డ్రన్స్ పార్కును ఆధునికరించారు. వారితో పాటు పెద్దలు కూడా పార్కులకు వెళ్లి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని వీక్షిస్తూ అందిస్తున్నారు.

ఘనంగా రజక కార్తీక వనభోజనాలు

విశాలాంధ్ర - వేటపాలెం : మండల పరిధిలోని డిగ్రీ కాలేజీ బైపాస్ రోడ్ వద్ద వేంచేసియున్న గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ దేవస్థానం వద్ద ఆదివారం రజక కార్తీక వనమహోత్సవ భోజనాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వేటపాలెం మండల రజక అభివృద్ధి సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో వనభోజన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పలు ప్రాంతాల నుండి వనభోజనానికి విచ్చేసిన ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు పూర్తి ఏర్పాట్లు చేశారు.ఆహ్లాదకరమైన వాతావరణంలో విస్తారమైన చెట్ల నీడలో కుటుంబ సమేతంగా కూర్చొని వనభోజనాలు చేశారు.ముందుగా వేటపాలెం మండల రజక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పెద్దలు కార్యనిర్వాహకులు భీమవరపు సుబ్బారావు,కొన్నె కోటేశ్వర రావు,తురకపల్లి శ్రీనివాసరావు,వసంత చెన్నకేశవ రావు,స్వర్ణ వీర రాఘవులు ను ఘనంగా సత్కరించారు.

పనిచేయని బిఎల్‌ఓలపై క్రమశిక్షణ చర్యలు

నిర్లక్ష్యంగా వ్యవహరించిన బియల్‌ఓలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కొలలపూడి హైస్కూల్ వద్ద సర్పంచ్ ఎం.సతీష్ కుమార్ ఆర్.డి.ఓ గ్లోరియాను మర్యాద పూర్వకంగా కలిశారు.

విశాలాంధ్ర - మార్టూరు : కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులు పరిశీలించి, వారికి ఓటు హక్కు కల్పించే బాధ్యత బియల్‌ఓలదేనని,అలా చేయని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని బాపట్ల ఆర్.డి.ఓ గ్లోరియా అన్నారు.ఆదివారం ఈ నెల 9,10 తేదీల్లో జరిగే స్పెషల్ సమ్మర్ రెవిజన్‌లో భాగంగా మార్టూరు మండలంలో బొల్లాపల్లి, తటివారి పాలెం,కోలలపూడి,కోనంకిలలో ఎన్నికలు జరిగే ఎన్నికల బూత్‌లను పరిశీలించారు.ఒక్కో బూత్‌కు ఎన్ని దరఖాస్తులు వచ్చాయని బియల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు.ఎన్నికల బూత్‌ల వద్ద ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు బియల్‌ఓలు పనిచేయాలని తెలిపారు. వచ్చిన దరఖాస్తులు రిజిస్టర్‌లో నమోదు చేసి పై అధికారులకు తెలపాలని కోరారు.సచివాలయంలో గతంలో పేరు నమోదై,ఇప్పుడు బదలీ అయిన వారు సంబంధించిన తహసీల్దార్‌ను సంప్రదించి తమ పేరును మార్పు చేసువాలని కోరారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : యూటీఎఫ్ పిట్టలవానిపాలెం మండల శాఖ నూతన కౌన్సిల్ సమావేశం ఆదివారం చందోలు యూటీఎఫ్ కార్యాలయంలో జరిగింది.ఈ సమావేశంలో భాగంగా యూటీఎఫ్ పిట్టలవానిపాలెం మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నికను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా ఆడిట్ కమిటీ సభ్యులు సయ్యద్ హబీబ్ వ్యహరించారు.ఈ ఎన్నికలో గౌరవ అధ్యక్షులుగా కె.ధన్,నూతన మండల అధ్యక్షులుగా మహమ్మద్ రహమతుల్లా,సహాధ్యక్షులుగా టి.శ్రీనివాసరావు, మహిళా సహ అధ్యక్షులుగా బర్కతున్నీసా,ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ రాఖీబుద్దిన్,ఆర్థిక కార్యదర్శిగా మహమ్మద్ అస్లాఫల్లి,కార్యవర్గ సభ్యులుగా నాగ సుబ్బయ్య, మహమ్మద్ ఖాసిం,మక్బుల్,సుభాని,సయ్యద్ షబానా,షేక్ ఖమర్ జహాన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గంను మండలంలోని ఉపాధ్యాయులు,పలువురు అభినందనలు తెలిపారు.

టార్పాలిన్ పట్టాలు, దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని దిగువమెట్ట గ్రామంలోని చెంచు కాలనీలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ రిలీఫ్ మెటీరియల్స్ టూ ట్రైబల్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చెంచుకాలనీలోని 100 కుటుంబాలకు దుప్పట్లు, టార్పాలిన్ పట్టలను అందచేశారు. రెడ్ క్రాస్ సొసైటీ నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర ట్రేజరర్ చిట్యాల వెంకటేశ్వరరెడ్డి ,మాజీ ఎంపీటీసీ సభ్యులు పాలుగుళ్ళ ప్రతాప్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి బంధుమిత్రుల ఆత్మీయ సమ్మేళనం ప్రచార పత్రికల ఆవిష్కరణ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రెడ్డి సేవ మిత్ర చారిటబుల్ ట్రస్ట్,యోగివేమన ఉయ్యాల వాడ నరసింహారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డిసెంబర్ 29వ తేదీన బాపట్ల జిల్లా కేంద్రంలోని సూర్యకాళి ఫంక్షన్ హాల్‌లో జరిగే రెడ్డి బంధు మిత్రుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పత్రికలను ఆదివారం రెడ్డి సేవా మిత్ర చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు నంగు గోవర్ధన రెడ్డి,యోగి వేమన,ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మున్నం భోగేశ్వర రెడ్డి, డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు దొంతిరెడ్డి ఏడుకొండల రెడ్డి, రెడ్డి సేవా మిత్ర యూత్ అధ్యక్షుడు అక్కల రమణారెడ్డి, ప్రముఖ న్యాయవాది పిట్ల శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించా రు.ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి,భోగేశ్వర రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగం కల్పించేందుకు వీలుగా ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.తెలంగాణ,ఆంధ్ర రాష్ట్రాలలోని ప్రముఖ వ్యాపార సంస్థల యజమానులు, డాక్టర్లు, లాయర్లు,ప్రముఖ రాజకీయ నాయకులు విచ్చేస్తున్నారన్నారు.ఈ సమ్మేళనంలో ఆంధ్ర,తెలంగాణ రాష్ట్రాల్లోని రెడ్డి సోదరి,సోదరులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది దిండి కనకా రెడ్డి సీనియర్ నాయకులు మున్నం పోలి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫోక్సో కేసు నమోదు

విశాలాంధ్ర-టంగుటూరు: మండలంలోని కారు నుంచి గ్రామంలో మైనర్ బాలికపై అత్యాచారం జరిగిన ఘటనపై శనివారం టంగుటూరు పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు అని సింగరాయకొండ సిఐ సిహెచ్ హజరత్తయ్యా తెలిపారు. చట్ట ప్రకారం బాధితురాలు యొక్క వివరాలు బయటకు తెలియకూడదు అని ఈ కేసు దర్యాప్తులో ఉన్న ముద్దాయిని గుర్తించి త్వరలో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆదివారం ఒంగోలు డి.ఎస్.పి రాయపాటి శ్రీనివాసరావు సిఐ హజరత్ అయ్యా ఎస్ఐ నాగమల్లేశ్వరరావు కాల్ గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ అధికారి మాధవి లత మహిళ ఎస్సై అనిత పాఠశాల హెచ్ఎం విచారణ చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర - బాపట్ల : 1974 సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం బాపట్లలో గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు.సమావేశానికి పూర్వ విద్యార్థి రోహిణి మహేష్ అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథిగా మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి పాల్గొని ఆమె మాట్లాడుతూ పూర్వ విద్యార్థులకు, ప్రస్తుత విద్యార్థులకు ఉన్న తేడాను,తల్లిదండ్రుల బాధ్యత రహిత్యాన్ని గురించి వివరించారు.విశిష్ట అతిథిగా జిల్లా అడిషనల్ ఎస్పీ పాండురంగ విఠల్ మాట్లాడుతూ ఆధ్యాత్మికంగా మానవుడు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తాడని వివరణాత్మకంగా వివరించారు.అనంతరం పూర్వ విద్యార్థులందరూ కలిసి వారి గురువు చలమయ్య మాస్టారును ఘనంగా సత్కరించారు.పూర్వ విద్యార్థులు వారి 50 సంవత్సరాల జ్ఞాపకాలు ఒకరిని ఒకరు పంచుకున్నారు.అనంతరం పిడి.కత్తి శ్రీనివాసరా వు, ఆనాటి అటెండర్ చిన్నిబోయిన సుబ్బారావును సన్మానించారు. జులగంటి ప్రసాద్, తిలక్,పాంచ్ జన్య,తిమ్మరాజు సుబ్బారావు,బి.వేణుగోపాల్, ఏక హనుమంతరావు,నాగవరపు నాగేశ్వరరావు, రషీద్, హరి ప్రకాష్,చలమయ్య,రోశయ్య పాల్గొన్నారు.